# ‘అడవి, భూమి, నీటిపై హక్కుకోసం ఆదివాసులు ఉద్యమించాలి’

**- కా॥ఝాన్సీ ఉద్ఘాటన**




ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అమరులకు నివాళులు

**‘ప్రపంచ** ఆదివాసీ దినోత్సవం’ సందర్భంగా 2023 ఆగస్టు 9న ఏజన్సీ గిరిజన సంఘం, రైతు కూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, గంగవరం మండలం-కొండమొదలు ఆర్&ఆర్ పెదకాలనీ ఆదివాసుల సభ జరిగింది. ఈ సభకు ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥కుంజం రామారావు అధ్యక్షత వహించారు. మణిపూర్‌లో బిజెపి ప్రేరిత మతోన్మాద మెయితీ మూకలు నాగా, కుకీ తదితర ఆదివాసీ తెగలు, జాతులపై సాగించిన జాతిహనన మారణకాండలో మరణించిన వారందరికీ సంతాపం తెలుపుతూ సభ రెండు నిముషాలు మౌనం పాటించింది.

**కొండమొదలు గిరిజనోద్యమంపై పుస్తకావిష్కరణ**

సిపిఐ(ఎం-ఎల్) తూర్పుగోదావరి జిల్లా కమిటి ప్రచురించిన ‘ఒడిదుడుకులనధిగమిస్తూ సాగిన అర్ధశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం’ అనే 272 పేజీల పుస్తకాన్ని ఏజన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు కా॥వేట్ల విజయ ఆవిష్కరించి, తొలి పుస్తకాన్ని కొండమొదలు ఉద్యమ సీనియర్ నాయకులు కా॥తామా ముత్యాలుకు, రెండవ పుస్తకాన్ని ఏజన్సీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డికి అందజేశారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కా॥ఝాన్సీ మాట్లాడుతూ దీనిని పోరాట దినంగా జరుపుకోవాలన్నారు. అడవులన్నింటినీ అధికారికంగా బహుళజాతి, కార్పొరేట్లకు కట్టబెట్టే అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని వారం రోజుల క్రితమే పార్లమెంట్ ఆమోదించిందని, ఆదివాసీ మహిళ రాష్ట్రపతి ముర్ముచే దీనికి ఆమోదముద్ర వేయించారని తెలిపారు. ఆదివాసులను ఇప్పటికే వివిధ రూపాల్లో అడవుల నుండి తరిమేస్తున్నారని, ఎదురుతిరిగితే మణిపూర్ తరహా దాడులు సాగిస్తామని చేస్తున్న హెచ్చరికలలో భాగమే-బిజెపి కనుసన్నలలో జరిగిన మారణకాండ అని వివరించారు. ఆదివాసులపై, మైనారిటీలపై దాడులు చేస్తే సహించబోమని దేశ ప్రజలంతా బాధితులకు అండగా గొంతెత్తారన్నారు. ప్రజలు చైతన్యవంతులైతేనే పాలకులు భయపడతారన్నారు. ఆదివాసుల దినోత్సవాన్ని, అల్లూరి వర్ధంతిని పాలకులు ఘనంగా జరుపుతూ వంచనాత్మకంగా వ్యవహరిస్తూ, పీడిత ఉద్యమాలను అణచి వేస్తున్నారని చెపుతూ ఆదివాసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు పూనిక వహిద్దామని ఆమె పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ఎంఎస్ నాగరాజు మాట్లాడుతూ పాలకులు అటవీ చట్టంలో చేసిన సవరణలతో అడవి నాశనమై ఆదివాసులు నిరాశ్రయులవుతారని, గ్రామసభల అధికారం రద్దవుతుందని పేర్కొన్నారు. పర్యావరణ సమస్యలు తీవ్రంగా తలెత్తుతాయన్నారు. మానవ మనుగడ ప్రశ్నార్ధకమౌతుందన్నారు. పాలకపార్టీలన్నీ ఈ చట్టాలకు అనుకూలమేనని వివరిస్తూ అటవీ సంరక్షణ చట్ట సవరణను సంపూర్ణంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర)సహాయ కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినాన్ని పోరాటదినంగా మనం సరైనవిధంగా నిర్వహించామన్నారు. కామన్ సివిల్‌కోడ్ పేరిట ఆదివాసీ ఆచార సాంప్రదాయాలపై దాడి చేస్తున్నారని, హిందూ మతాన్ని రుద్దబోతున్నారని, దొంతుఒరియా, వాల్మీకులను గిరిజనులలో కలిపే చర్యలను నిరసించాలని ఆయన కోరారు.

ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు ఊయక ముత్యాలు మాట్లాడుతూ బిడి శర్మ గారి వంటి ఆదివాసీ బాంధవులు ‘మావూళ్ళో మా రాజ్యం’ కోసం, 1/70 చట్టం అమలు కోసం నిలిచారని చెబుతూ ద్రౌపది ముర్ము ఆదివాసీ మహిళ అయినంతమాత్రాన ఆదివాసుల హక్కులను కాపాడటం జరగదని, ఐక్యపోరాటాలే పరిష్కారమని పేర్కొన్నారు.

ఇంకా ఈ సభలో ఏజన్సీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డి తదితరులు మాట్లాడారు. కొండమొదలు పోరాటాన్ని, అమరుల త్యాగాలను గుర్తుచేస్తూ, గిరిజనులను అడవి నుండి దూరం చేసే పాలకుల కుట్రలను నిరసిస్తూ ప్రజాకళాకారులు పాడిన పాటలు స్ఫూర్తిదాయకంగా వున్నాయి.

* * * * *